

ఎమ్మెల్యే గాంధీతో సప్తగిరి కాలనీ వాసులు

## సప్తగిరి కాలనీ సమస్యలు పరిష్కరించండి

**మియాపూర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):** హఫీజ్‌పేట డివిజన్ సప్తగిరి కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి స్థానికులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎమ్మెల్యేను సప్తగిరి కాలనీ వాసులు కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారంతోపాటు అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను త్వరలోనే పూర్తిచేస్తామని హామీ ఇచ్చారని కాలనీ వాసులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు వెంకట్ యాదవ్, నందు, అర్జున్, శ్రీరాములు, నర్సింహులు, శ్రీనివాస్, చెంచురామయ్య, శ్రీధర్, వెంకటేష్, సురేష్, స్థానికులు పాల్గొన్నారు.

## సొంత డబ్బులతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుపై గుంతలను పూడ్చివేయిస్తున్న మాధురి, శివాజీరాజు

**పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):** కొంపల్లి మున్సిపల్ పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో మున్సిపల్ చైర్మన్, అధికారులు విఫలమయ్యారని మహిళ మోర్చా అధికార ప్రతినిధి మాధురి శివాజీరాజు ఆరోపించారు. మున్సిపల్‌లోని 12వ వార్డు ఎన్‌సీఎల్ నార్త్ కాలనీ మెయిన్‌రోడ్డు నుంచి కాలనీకి వచ్చే ప్రధాన రోడ్డులో భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయంపై గత సంవత్సరం నిరసన తెలిపి అప్పటి కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అయినా నేటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో మాధురి శివజీరాజ్ దంపతులు సొంత నిధులతో రోడ్డుపై ఉన్న గుంతలను సిమెంట్‌తో పూడ్చి వేయించారు. సమస్యను పరిష్కరించిన దంపతులను కాలనీ వాసులు అభినందించారు.

## గాజులరామారంలో కుంటుపడిన అభివృద్ధి



కాలనీలో పర్యటిస్తున్న సొంటిరెడ్డి పున్నారెడ్డి

**గాజులరామారం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):** గాజులరామారం డివిజన్‌లో అభివృద్ధి కుంటుపడిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ ఎంఎస్ ఫంక్షన్‌హాల్ రోడ్డులో కాలనీ వాసులతో కలిసి ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అధికారులు ముందస్తు ప్రణాళిక లేకుండా డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేశారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పున్నారెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది లేకుండా డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని సూచించారు.

## కుత్బుల్లాపూర్‌లో కలుషిత నీరు సరఫరా



నల్లా ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీరు

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):** కుత్బుల్లాపూర్ పరిధిలోని సాధన మెమోరియల్ స్కూల్ పరిసర ప్రాంతాల్లోని ఇళ్లకు రెండు మూడు రోజులుగా కెమికల్ వ్యర్థాలతో కూడిన తాగునీరు సరఫరా అవుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నల్లాల ద్వారా పూర్తిగా కలుషితమై నీరు రావడంతో ఇంటి అవసరాలకు కూడా వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

## జిమ్నాస్టిక్స్‌లో కావ్యకు స్వర్ణం

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్‌లో బాలికల బాలెన్సింగ్ బీమ్ విభాగంలో కావ్య స్వర్ణం పతకం సాధించింది. గచ్చిబౌలిలో జరిగిన ఈ పోటీల్లో కావ్య అగ్రస్థానంలో నిలవగా, ఇషిత రెడ్డి రజతం, అవని కాంస్యం సాధించారు. బాలెన్సింగ్ బీమ్‌తో పాటు టేబుల్ వాల్ట్, ఫ్లోర్ తదితర విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో జంట నగరాలకు చెందిన సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో హేమంత్ జిమ్నాస్టిక్స్ అకాడమీకి చెందిన క్రీడాకారులు ఏకంగా తొమ్మిది స్వర్ణాలు, 22 రజతాలు, 14 కాంస్య పతకాలు సాధించడం విశేషం.

## క్రీడాసామగ్రి పంపిణీ



గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 8నుంచి 11వరకు జరిగే మాస్టర్స్ జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడాసామగ్రిని చందానగర్ పీజేఆర్ స్టేడియంలో అసోసియేషన్ సభ్యులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొండా విజయ్ హాజరై క్రీడాకారులకు క్రీడాకిట్లను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సురేందర్, స్వాతిగౌడ్, క్రీడాకారులు చిరంజీవులు, శివలీల, శైలజ, రంగారావు తదితరులు ఉన్నారు.

- చందానగర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి)



హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను చండీగడ్‌లోని రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

- జీడిమెట్ల ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)



చలో సిద్దిపేట కార్యక్రమంలో భాగంగా కొంపల్లి మున్సిపల్‌లో తెలంగాణ కాంగెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు ఎస్.భూపతిరెడ్డి, ప్రశాంత్‌గౌడ్, దేవేందర్, శివకుమార్‌గౌడ్, సన్నా శ్రీనివాస్‌గౌడ్

- పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి)



హఫీజ్‌పేట ఫ్లైఓవర్ నుంచి హుడాకాలనీ వరకు చేపట్టిన మంజీరా పైపులైన్ పనులు త్వరగా పూర్తిచేయాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎండీ సుదర్శన్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

- మియాపూర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి)



బాల్క సుమన్‌పై కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సునీల్ యాదవ్



బాల్క సుమన్‌పై జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు



బాల్క సుమన్‌పై కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు కూన సత్యంగౌడ్, వెంకట్, ప్రసాద్ తదితరులు

# బాల్క సుమన్‌ను అరెస్టు చేయాలి



కేపీహెచ్‌బీకాలనీ టెంపుల్ బస్టాపు వద్ద బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లోని ఆయా ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేసి బాల్క సుమన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. బాల్క సుమన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి, జగద్గిరిగుట్ట, కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్ బృందం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)



మూసాపేట రహదారిపై బైఠాయించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



హైదర్‌నగర్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, నాయకులు



చందానగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



జగద్గిరిగుట్టలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వీవీనగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు

## వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు: ఎమ్మెల్యే కృష్ణారావు

**కూకట్‌పల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):** వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశించారు. కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన జలమండలి, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమావేశమయ్యారు. మంచినీటి పైపులైన్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులకు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ కార్పొరేటర్లు సూచించిన పనులను జలమండలి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు సమన్వయం చేసుకొంటూ సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నర్సింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, సబీహాబేగం, శిరీష, జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, మహేశ్వరి, జలమండలి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పార్కు పనులు పరిశీలన..

కేపీహెచ్‌బీకాలనీ ధనలక్ష్మి సెంటర్‌లో నూతనంగా చేపడుతున్న పార్కు సుందరీకరణ పనులను మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. పార్కులో పచ్చదనం పెంపొందించడంతో పాటు పిల్లలు ఆడుకొనేలా పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కు చుట్టూ కాంపౌండ్‌వాల్ నిర్మాణంతోపాటు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ సత్యనారాయణ, డీఈఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీలో పార్కు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

## ఓటు.. అభివృద్ధి, సంక్షేమానికి కొలమానం: కేపీ వివేకానంద్

**పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):** ఎన్నికల్లో వచ్చే ఓట్లు మెజారిటీ మాత్రమే కాదని, చేసిన అభివృద్ధి, సంక్షేమానికి కొలమానమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఎమ్మెల్యే చేపట్టిన కృతజ్ఞత యాత్ర మంగళవారం 21వ రోజు జీడిమెట్ల డివిజన్‌లోని గోదారి హోమ్స్, గాయత్రినగర్, బౌద్ధనగర్‌లో కొనసాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ తనను మరోసారి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, సంక్షేమ సంఘం నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

# బస్టాపుల్లో మాత్రమే బస్సులు ఆపాలి

**హైదర్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):** బస్టాపుల్లో మాత్రమే బస్సులు ఆపాలని, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ బస్సులు ఆపే డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ సీఐలను మేడ్చల్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ఆర్టీసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మియాపూర్, హైదర్‌నగర్, నిజాంపేట్ క్రాస్‌రోడ్డు, జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీ, వివేకానందనగర్, సుమిత్రానగర్, కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో జాతీయ రహదారి వెంట బస్టాపుల ఏర్పాటు, కూడళ్ల వద్ద వాహనాల మళ్లింపు, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై మంగళవారం క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. పాదచారులు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీ ప్రయాణికుల కోసం బస్టాపులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.



ట్రాఫిక్ పోలీసులతో సమీక్షిస్తున్న అడిషనల్ డీసీపీ

## రియాక్టర్ క్లీన్‌చేస్తుండగా.. మంటలు

- ముగ్గురు కార్మికులకు తీవ్రమైనగాయాలు
- ఆస్పత్రి నుంచి రెండు రోజులకే ఇంటికి తరలించిన యాజమాన్యం

**జీడిమెట్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):** జీడిమెట్ల పారిశ్రామికవాడ రామిరెడ్డినగర్ సమీపంలో గల కార్తికేయ కామాక్షీ పరిశ్రమలో ఈ నెల 1వ తేదీన ఉదయం 10గంటలకు రియాక్టర్ వద్ద మంటలంటుకుని ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సూరారంకాలనీ ఓంజెండా ప్రాంతంలో ఉంటున్న కడప జిల్లా వాసి శ్రీరాములు రెడ్డి(44) ఈ పరిశ్రమలో షిఫ్ట్‌ఇన్‌చార్జి. గురువారం రాము, మరో కార్మికునితో కలిసి రియాక్టర్ క్లీన్ చేయిస్తుండగా ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో శ్రీరాములు రెడ్డి ముఖం కాలిపోయింది. రాము, మరో కార్మికుడికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులకు కంపెనీ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా సూరారంలోని ఓఆస్పత్రిలో వైద్యం చేయించి రెండు రోజుల తర్వాత ఇంటికి తరలించింది. కంపెనీ యాజమాన్యం బలవంతంగా తమను ఇంటికి పంపించారని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. సంఘటన గురించి పోలీసులకు తెలిసినా కేసు నమోదు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

## గంజాయిచాక్లెట్‌లు, ఎండుగంజాయి స్వాధీనం

- ఇద్దరు ఉత్తర ప్రదేశ్ కార్మికుల అరెస్ట్

**పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):** ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు కార్మికుల నుంచి 2.2గంజాయి చాక్లెట్‌లు, 750కిలోల ఎండుగంజాయిని మేడ్చల్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.యాదయ్య, సీఐ నర్సింహారెడ్డి వెల్లడించారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రాజ్‌కుమార్, విమల్‌కుమార్ కలిసి కొంపల్లిలోని శ్రీరామగార్డెన్, జైన్‌కన్‌స్ట్రక్షన్ వద్ద భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. మంగళవారం లేబర్ క్యాంపుపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించగా గంజాయి చాక్లెట్‌లు, ఎండుగంజాయి దొరికాయి. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## అనుమానాస్పదస్థితిలో గృహిణి ఆత్మహత్య

**గాజులరామారం ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):** అనుమానాస్పదస్థితిలో గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా, కపిలేశ్వరం మండలం, కోరుమిల్లుకి చెందిన ఆదినారాయణ కూతురు వీర గణికమ్మ(23)కు సూరారం సాయిబాబా నగర్ కృషి కాలనీకి చెందిన మణికంఠతో 2022 మే 22న వివాహం జరిగింది. మణికంఠకు కట్నం కింద రూ. 7.15లక్షలు జాయింట్ అకౌంట్లో అమ్మాయి తల్లిదండ్రులు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అలాగే కూతురుకు 8 కాసుల బంగారం పెట్టి, రెండు కాసుల బంగారాన్ని అబ్బాయికి పెడతామని ఒప్పుకున్నారు. కానీ, అవి పెట్టలేదు. అప్పటినుంచి మణికంఠ భార్యని కట్నం, బంగారం కోసం వేధించేవాడు. దీంతో ఒక సంవత్సరం పాటు అమ్మాయి తల్లిదండ్రుల వద్దే ఉంది. 2023 జూన్ 16న తన భార్యను నగరానికి తీసుకువచ్చాడు. సోమవారం రాత్రి మూడు గంటలకు వీర గణికమ్మ తల్లిదండ్రులకు అల్లుడు ఫోన్ చేసి 'మీ అమ్మాయి ఉరి వేసుకుని చనిపోయింది'అని చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వచ్చారు. అల్లుడు, ఆయన తమ్ముడు శ్రీరామ్ కలిసి తమ కూతుర్ని చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

## చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్

**హైదర్‌నగర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):** ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి జోన్ ఏసీపీ శివభాస్కర్ వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన పెదవల్లి సంజయ్‌కుమార్(23) కేపీహెచ్‌బీ పరిధిలోని అడ్డగుట్టలో హాస్టల్‌లో నివాసం ఉంటున్నాడు. పగలు పలు కాలనీల్లో సంచరిస్తూ తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి వేళ వాటి తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన అనంతరం ఆ ఇంటికి మరో తాళం వేసి పారిపోయేవాడు. గత నెల 30న కేపీహెచ్‌బీ కాలనీ ఫేస్-3లో ఇదే తరహాలో చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం అడ్డగుట్టలో అనుమానాస్పదంగా తిరుగుతున్న సంజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించి పాత నేరస్థుడిగా గుర్తించారు. అతని వద్ద నుంచి రూ.12లక్షల విలువ చేసే 20.7తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. సంజయ్ గతంలో కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు, తిరుపతిలో ఐదు చోరీలకు పాల్పడినట్లు ఏసీపీ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన ఇన్‌స్పెక్టర్ వెంకన్న, డీఐ రాజేందర్, కానిస్టేబుళ్లను ఏసీపీ శివభాస్కర్ అభినందించారు.

## 'బీఆర్‌ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి'

**ఫతేనగర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):** బీఆర్‌ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘాల ఐక్యవేదిక కార్యనిర్వాహక కార్యదర్శి పట్లోళ్ల నాగిరెడ్డి హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిని దుర్భాషలాడిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీరుపై రెడ్డి సంఘాల నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి సీఎం కావడం బీఆర్‌ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన ఆరోపించారు.

## జేఎన్‌టీయూ రెక్టార్‌గా విజయకుమార్ రెడ్డి

- ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ నియామకానికి పాలకమండలి గ్రీన్ సిగ్నల్



విజయకుమార్ రెడ్డి

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):** జేఎన్‌టీయూ రెక్టార్‌గా మెకానికల్ ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ కొండక్కగారి విజయకుమార్ రెడ్డి నియమితులయ్యారు. వైస్ చాన్సలర్ ప్రతిపాదనల మేరకు ఈ నియామకాన్ని మంగళవారం జరిగిన పాలకమండలి సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అంతకు మునుపు ఇటీవల వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా నియమితులైన ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు నియామకానికి కూడా పాలకమండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉదయం పదకొండు గంటలకు వీసీ డాక్టర్ కట్టా నరసింహారెడ్డి అధ్యక్షతన ఉన్నత విద్యామండలి ప్రాంగణంలో పాలకమండలి సమావేశం నిర్వహించాల్సి ఉండగా కోరంలేక సమావేశం మధ్యాహ్నం 2గంటలకు వాయిదాపడింది. అనంతరం అజెండాలో పలు అంశాలపై పాలకమండలి సభ్యుల మధ్య వాడీవేడిగానే చర్చ జరిగింది. కాగా, కొత్తగా ఏర్పాటైన పాలేరు, మహబూబాబాద్ జేఎన్‌టీయూ కళాశాలలకు భూమి కేటాయింపుల అంశాలను అజెండాలో చేర్చినప్పటికీ, సమయం లేనికారణంగా అవి చర్చకు నోచుకోలేదు. సమావేశంలో రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, పాలకమండలిలో సభ్యులైన ప్రభుత్వ ఉన్నతాధికారులు, జేఎన్టీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కట్టమైసమ్మ జాతరకు శరవేగంగా ఏర్పాట్లు

**షాపూర్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):** ఈ నెల 10 నుంచి 12వ వేదీ వరకు నిర్వహించే సూరారం కట్టమైసమ్మ, రేణుకా ఎల్లమ్మ అమ్మవార్ల జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కాలగకుండా ముందస్తుగా టాయిలెట్స్, తాగునీటి సదుపాయాలు, పటిష్ట భద్రతకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నెల 11న అమ్మవారి ప్రధాన జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

## గంగపుత్ర సంఘం నూతన కమిటీ ఎన్నిక



గంగపుత్ర సంఘం నూతన కమిటీ సభ్యులతో కార్పొరేటర్ నర్సింహయాదవ్

**ఓల్డుబోయినపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):** ఓల్డుబోయినపల్లి డివిజన్ గంగపుత్ర సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జనార్దన్, జనరల్ సెక్రటరీగా అశోక్, దేవాలయ కార్యదర్శిగా పెంటయ్య ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నూతన అధ్యక్షుడు జనార్దన్‌ను శాలువాతో సత్కరించి, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో దానయ్య, బిక్షపతి రాజు, సంజీవ, నారాయణ, శివ, నర్సింగ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

- క్యాలెండర్ ఆవిష్కరణ

ఓల్డుబోయినపల్లి డివిజన్ పరిధిలోని మందుల బస్తీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన-2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కార్పొరేటర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మందుల బస్తీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శివగుప్తా



అధ్యక్షుడిగా ఎన్నికైన శివగుప్తాను సన్మానిస్తున్న కేపీ విశాల్‌గౌడ్

**షాపూర్‌నగర్, పిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):** సూరారం డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా దానం శివగుప్తా విజయం సాధించారు. మంగళవారం దారం శివగుప్తా ప్యానల్ సభ్యులు కుత్బుల్లాపూర్‌లో యువ నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్‌ని మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా దానం శివగుప్తా ప్యానల్ సభ్యులను విశాల్ గౌడ్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణ్, అబిలాష్, బషీర్, కృష్ణారెడ్డి, యాదయ్య, శ్రీను, నవీన్, యోగి, శివనాయక్, శంకర్‌గౌడ్, లత, లక్ష్మి, కవిత, షీలా, దేవి తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):** కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికుల హాజరును పని చేసే చోటనే నమోదు చేసుకొనేలా చర్యలు తీసుకొని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఉమామహేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఏఐటీయూసీ మండల కార్యదర్శి స్వామి, అధ్యక్షుడు హరినాథ్, మున్సిపల్ అధ్యక్షుడు రాములు, కార్మికులు ఉప కమిషనర్ నర్సింహాకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. స్పందించిన డీసీ రెండు రోజుల్లో సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.